క్లుప్తంగా

ఎమ్మెల్సీపై అనుచిత వ్యాఖ్యలు సరికావు

శాంతినగర్: మచ్చలేని నాయకుడు ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి అని వడ్డేపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణ అన్నారు. ఆదివారం బీఆర్‌ఎస్ నాయకుడు సూరి మాట్లాడుతూ వేల ఎకరాల భూములు, పుట్టుకతోనే శ్రీమంతుడైన చల్లా వెంకట్రామిరెడ్డి ఆపదలో అభయహస్తం అందించే నాయకుడన్నారు. విలువలతో కూడిన రాజకీయాలు చేశారు తప్ప ఏనాడూ పరాయి సొమ్ముకు ఆశపడలేదన్నారు. చల్లా వెంకట్రామిరెడ్డిపై బురదజల్లే రాజకీయాలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.

గ్రామాభివృద్ధికే నిధులు వినియోగించాలి



ఆత్మకూర్: దిగువ జూరాల జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రం నిర్మాణానికి భూసేకరణ చేపట్టిన అనంతరం విడుదలైన నిధులను గ్రామాభివృద్ధికే వినియోగించాలని కాంగ్రెస్ పార్టీ కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు వినయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని మూలమల్ల గ్రామస్తులతో కలిసి ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జెన్‌కో ప్రాజెక్టు నిర్మాణం సందర్భంగా గ్రామశివారులో విలువైన భూములకు నామమాత్రంగా పరిహారం చెల్లించారని తెలిపారు. గ్రామాభివృద్ధి కోసం జెన్‌కో అధికారులు గతంలో రూ.95లక్షలు విడుదల చేయగా.. రూ.23లక్షలతో విద్యుద్దీకరణ పనులు చేపట్టారన్నారు. మిగిలిన రూ.72లక్షలను గ్రామాభివృద్ధికే వినియోగించాలని కోరారు. నిధులను దారి మళ్లిస్తే పెద్దఎత్తున ఉద్యమిస్తామన్నారు. సమావేశంలో రాజశేఖర్‌రెడ్డి, మహిమూద్, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

కరాటేతో ఆత్మరక్షణ



పెబ్బేరు రూరల్: కరాటేతో ఆత్మరక్షణ లభిస్తుందని టైగర్స్ కుంగ్‌ఫూ కరాటే అకాడమీ డైరెక్టర్ విజయ్ అన్నారు. మండలంలోని శాఖాపూర్ ప్రగతి విద్యాలయంలో ఆదివారం కరాటే విద్యార్థులకు బెల్టు గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. వివిధ విభాగాల్లో 100మంది విద్యార్థులు పాల్గొని బెల్టులు సాధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో బాలబాలికలు కరాటే నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. క్రీడలతో శారీరక దారుఢ్యంతోపాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు బెల్టులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ భీంసాగర్, ప్రిన్సిపాల్ రిజోజి, భీమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

రక్తదానం.. మరొకరికి ప్రాణదానం



పెబ్బేరు రూరల్: అర్హులైన ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎద్దుల కరుణశ్రీ, బీఆర్‌ఎస్ ఎన్నికల సమన్వయకర్త వంగూర్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి అన్నారు. వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకొని మండల కేంద్రంలో ఆదివారం శ్రీరామ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఆపద సమయంలో అవసరమైన రక్తం దొరక్క ఎంతోమంది అవస్థలు పడుతున్నారని తెలిపారు. యువత స్వచ్ఛందంగా రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ సమన్వయంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. వైస్‌చైర్మన్ కర్రెస్వామి, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కుతుబుద్దీన్, శ్రీరామ యువజన సంఘం అధ్యక్షుడు గోనెల రాఘవేంద్ర, రక్తనిధి కేంద్రం కార్యకర్త లక్ష్మీపతి, శ్రీనివాసులు, లక్ష్మి, లత, రమేష్, ఇఫ్తేకార్‌అలీ పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి కృషి



పెబ్బేరు రూరల్: పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని సర్పంచ్ నిర్మల అన్నారు. శ్రీరంగాపురం మండలం నాగరాలకు చెందిన వెంకటేశ్వరమ్మకు రూ.60వేలు, నరేందర్‌గౌడ్‌కు రూ.13,750 విలువైన సీఎం సహాయనిధి చెక్కులను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకునేందుకు సీఎంఆర్‌ఎఫ్‌తో ఆదుకుంటున్నట్లు తెలిపారు.

మౌలిక వసతులేవి?

- అద్దె భవనాల్లో నిర్వహణ
- ఇబ్బందులు పడుతున్న లబ్ధిదారులు



అయిజలో ప్రహరీ లేని అంగన్‌వాడీ కేంద్రం

అయిజ: మండలంలో, మున్సిపాలిటీలో కలిపి మొత్తం 61 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వాటిని నాలుగు భాగాలుగా విభజించి ముగ్గురు సూపర్‌వైజర్లు విధులు నిర్వహిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలికవసతులు లేకపోవడంతో చిన్నారులు, గర్భిణులు, బాలింతలు అవస్థలు పడుతున్నారు. సొంతభవనాలు 29, ఉచిత భవనాలు 19, అద్దె భవనాలు 13 ఉన్నాయి. మండలంలో మొత్తం 8 అంగన్‌వాడీ టీచర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సంకాపురం, భూంపురం, యాపదిన్నె, ఎక్లాస్‌పురం, చిన్న తాండ్రపాడు, మేడికొండ, చిన్న తాండ్రపాడు, బైనిపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు లేక ఇన్‌చార్జ్ టీచర్లతో నెట్టుకొస్తున్నారు.

ఇరుకుగదులతో ఇక్కట్లు..

మండలంలోని మొత్తం 61 అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు 672 మంది, బాలింతలు 509 మంది, 6నెలల నుంచి ఏడాది వయసులోపు పిల్లలు 2832 మంది, మూడు సంవత్సరాలు వయసు పైబడిన పిల్లలు 2,451 ఉన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో అనుబంధ పోషకాహారం ఇవ్వడంతోపాటు పూర్వ ప్రాథమిక విద్యను, ఆరోగ్య పోషణ విద్యను నేర్పించాలి. తప్పని సరిగా పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. అంగన్‌వాడీ కేంద్రాలలో పోషక ఆహారం అందించడానికి సరిపడ గదులు, నీటి వసతి ఉండాలి. అంగన్‌వాడీ కేంద్రాలలో మౌలిక వసతులు లేకపోవడం వల్ల కేంద్రాలకు వచ్చేవారి సంఖ్య తగ్గిపోతోంది.

అద్దెభవనాల్లో నిర్వాహణ..



అంగన్‌వాడీ కేంద్రాలకు మౌలిక వసతులు, ప్రహరీ లేకపోవడంతో పందులు సంచరిస్తున్నా యి. ప్రహరీ, మరుగుదొడ్లు, బాత్‌రూంలు కట్టిస్తే బాగుంటది. అద్దె భవనాలలో అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ భవనాలు నిర్మించాలి. అన్ని వసతులుంటే అంగన్‌వాడీ కేంద్రానికి ఎక్కువమంది వెళ్తారు.

– శకుంతల, చిన్నతాండ్రపాడు

నూతన భవనాలు నిర్మించాలి..



నూతనంగా అంగన్‌వాడీ భవనాలు నిర్మించకపోవడంతో ప్రభుత్వ పాఠశాలల్లోని పాతభవనాలలో అంగ న్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తున్నా రు. అవి వర్షాకాలం తడిసిపోతుంటాయి. సరైన వసతి లేకపోవడంతో చిన్నారులు, మహిళలు ఇబ్బందులకు గురికావల్సి వస్తుంది. అన్ని మౌలిక వసతులు కల్పించి నూతన భవనాలు నిర్మిస్తే సౌకర్యవంతంగా ఉంటుంది.

– జయలక్ష్మి, పర్దీపురం

ఉన్నతాధికారులకు తెలియజేస్తున్నాం..



అంగన్‌వాడీ సమస్యలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలి యజేస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలల ఆవరణలోనే అంగన్‌వాడీ కేంద్రాలు నిర్మించే ప్రయత్నాలు చేస్తున్నాం. అంగన్‌వా డీ భవనాలు నిర్మించేందుకు ఖాళీ స్థలాలను ఇవ్వాలి. ఇప్పటి వరకు ఐదు గ్రామాల్లో మాత్రమే స్థలా లు అప్పగించారు.

– కమలాదేవి, సీడీపీఓ

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనుల పరిశీలన



ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల రూరల్: ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తీసుకురావాలని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన పట్టణ పోలీస్‌స్టేషన్ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులు, కాంట్రాక్టర్‌తో పనుల తీరుతెన్నులను అడిగితెలుసుకున్నారు. త్వరగా పనులు పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, పూడూరు చిన్నయ్య, గంటరమేష్, కురుమన్న పాల్గొన్నారు.

గద్వాల పట్టణంలో పలు కాలనీలలో ఏర్పాటు చేసిన వినాయకుని మండపాలను ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్‌లు సందర్శించారు. అనంతరం అన్నదానం చేపట్టారు.

విద్యార్థికి అభినందన..

ఎంబీబీఎస్‌లో సీటుసాధించిన విద్యార్థి నవీన్‌ను ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి అభినందించారు. ఈ మేరకు ఆమె తన నివాసంలో మల్దకల్ మండలం అమరవాయికి చెందిన నవీన్‌ను అభినందించి రూ.40వేల నగదు అందజేశారు.

ప్రేమలతకు బీఫాం ఇవ్వండి



శాంతినగర్: అలంపూర్ నియోజకవర్గంలో మార్పు జరగాలంటే బీఆర్‌ఎస్ పార్టీ బీఫాం ప్రేమలతకు ఇవ్వాలని మాదాసి, మాదారి కురువ సంఘం నాయకులు కోరారు. వడ్డేపల్లి మండలంలోని బుడమొర్సులో మాదాసి, మాదారి కురువ సంఘం నాయకుల సమావేశం నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రేమలతకు బీ ఫాం ఇస్తే అటు ఎస్సీ సామాజిక వర్గంతోపాటు కురువ సామాజిక వర్గం పూర్తి మద్దతు ఇస్తుందన్నారు. సమావేశంలో అలంపూర్ తాలూకా సంఘం అధ్యక్షుడు మల్లికార్జున్, సంఘం నాయకులు తాగూర్ కృష్ణ, పల్లయ్య, వెంకటేష్, వెంకటరాముడు, వంట రాముడు, బాలన్న, మేకల శీను, బింగి రంగన్న, లక్ష్మీనారాయణ, కర్ణం గిడ్డయ్య, ప్రవీణ్, వెంకటేష్‌లు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం



పాఠశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అబ్రహం

అయిజ: దేశంలో ఎక్కడాలేని విధంగా తెలగాణ రాష్ట్రం అభివృద్ధిపథంలో దూసుకపోతోందని, బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. ఆదివారం మండలంలోని తూంకుంటలో రూ.10 లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. మన ఊరు– మన బడి పథకంలో భాగంగా రూ.55 లక్షలతో ఆధునీకరించిన పాఠశాలను ప్రారంభించారు. మండలంలోని వెంకటాపురంలో సీఎం సహాయనిధి ద్వారా రూ.లక్ష చెక్కును అందజేశారు. అయిజ పట్టణంలో 5 లక్షల చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు మధ్య మురుగు

మానవపాడు: మండలకేంద్రంలోని పాత తహసీల్దార్ కార్యాలయం వెనుక వైపు మురుగునీరు రోడ్డు మధ్య ప్రవహిస్తోందని ప్రజలు వాపోతున్నారు. నివాసగృహాల మధ్య మురుగకంపుతో, ఈగలు, దోమలు వ్యాప్తి చెంది ప్రజలు రోగాలబారిన పడుతున్నారని,దదదదదద అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.



ఆత్మగౌరవం కోసం పనిచేస్తాం

అలంపూర్: జాతీ ఆత్మగౌరవం కోసం న్యాయబద్ధంగా పోరాటం చేస్తామని బీజేపీ జిల్లా కార్యదర్శి రవికుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ వర్గీకరణకు 2000 సంవత్సరంలో అప్పటి ప్రధాన మంత్రి అటల్‌బిహారి వాజ్‌పేయ్ వాగ్దానం మేరకు అప్పటి రాష్ట్రపతి కేఆర్ నారాయణ ఆమోద ముద్ర వేసినట్లు పేర్కొన్నారు. 2004లో కాంగ్రెస్ ప్రభుత్వం వర్గీకరణకు ఇచ్చిన ఆర్డినెన్స్‌ను నిలిపేస్తూ నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఎమ్మార్పీఎస్ వర్గీకరణకు కోసం అనేక ఉద్యమాలు చేసిందన్నారు.



మానవపాడులో వివిధ రకాల వేషధారణలో నృత్యం చేస్తున్న భక్తులు



శాంతినగర్‌లో గణేషునికి పూజలు చేస్తున్న మహిళలు

కనులపండువగా గణేశుని శోభాయాత్ర

శాంతినగర్: వారం రోజులుగా పూజలందుకున్న గణేశుని నిమజ్జన వేడుకల్లో భాగంగా నిర్వహించిన శోభాయాత్ర కనుల పండువగా నిర్వహించారు. వడ్డేపల్లి మున్సిపాలిటీ శాంతినగర్‌లో ప్రతిష్ఠించిన గణనాథుడిని ఆదివారం ట్రాక్టర్‌లో నిమజ్జనోత్సవానికి తరలించారు. శోభాయాత్ర రాజోళి సమీపంలోని సుంకేసుల బ్యారేజీ వరకు కొనసాగింది. శోభాయాత్ర అంగరంగ వైభవంగా కొనసాగింది.

ఘనంగా నిమజ్జనం

మానవపాడు: మండలంలోని వివిధ గ్రామాల్లో వినాయక నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. మండలకేంద్రంలో ని ర్వహించిన ఊరేగింపులో వివిధ రకాల వేషధారణలు, నృత్యప్రదర్శనలు, కోలాటలు వేస్తూ భక్తులు పాల్గొన్నారు.

నిమజ్జనంలో జాగ్రత్తలు పాటించాలి

వినాయక నిమజ్జనానికి తుంగభద్ర, కృష్ణనదిలకు వెళ్తున్న యువకులు, భక్తులు తగ్గు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్‌ఐ రాము తెలిపారు. ఆదివారం మండలంలోని వివిధ గ్రామాల్లో వినాయకుని నిమజ్జనానికి తరలింపుపై జాగ్రత్తలుపై వివరించారు. మద్యం తాగి గొడవలు పడకుండా మండలపాల నిర్వహకులు చుసుకోవాలని తెలిపారు. మండలంలోపి నిమజ్జనంకు తరలిస్తున్న వివిధ వినాయక విగ్రహాల వద్ద పట్టిష్ఠంగా బధ్రతను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

లడ్డూ వేలం రూ.18వేలు

ధరూరు: మండల కేంద్రంలోని శివాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక లడ్డూ వేలం పాటలో రూ.18వేలకు మండల కేంద్రానికి చెందిన బుచ్చిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి దక్కించుకున్నారు. ఆదివారం సాయంత్రం ఆలయ ప్రాగణంలో వినాయకుడి లడ్డూ వేలం నిర్వహించారు. అనంతరం టెంకాయ వేలంలో 1,016లకు చాకలి రవి దక్కించుకున్నారు. కార్యక్రమంలో అర్చకులు కిష్టాచార్యులు, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు డీఆర్ విజయ్ కుమార్, కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, శ్రీధర్, డిష్ వెంకటేశ్వర్‌రెడ్డి, కే శ్రీకాంత్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, వాహీద్, మోనేష్ పాల్గొన్నారు.



మానవపాడులో నృత్యం చేస్తున్న యువతులు



ధరూరులో పలకల భజన వేస్తున్న చిన్నారులు

అస్లాం షరీఫ్‌కు ఘన సన్మానం



అస్లాం షరీఫ్‌ను సన్మానిస్తున్న ప్రొఫెసర్లు, కవులు

శాంతినగర్: హాస్య కవి షేక్ అస్లాం షరీఫ్‌ను నాగర్‌కర్నూల్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో ప్రొఫెసర్‌లు, కవులు ఘనంగా సన్మానించారు. తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ, నెలపొడవు సాహిత్య సాంస్కృతిక వేదిక నాగర్ కర్నూల్ వారి ఆధ్వర్యంలో పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్ట్ గురించి నిర్వహించిన కవిసమ్మేళనంలో శాంతినగర్‌కు చెందిన కవి షేక్ అస్లాం షరీఫ్ పాల్గొన్నారు. హర్షనీయం అనే కవితను వినిపించిన అస్లాం షరీఫ్‌ను ఈసందర్భంగా ప్రొఫెసర్ మంజుల, కవులు కోట్ల వెంకటేశ్వర్‌రెడ్డి, మద్దిలేటి, సుబ్బయ్యలు అభినందించారు. అనంతరం శాలువా, ప్రశంసాపత్ర, మెమొంటోతో సన్మానించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి మొత్తం 100 మంది కవులు పాల్గొనగా వడ్డేపల్లి మండలం నుండి షేక్ అస్లాం ఒక్కరే పాల్గొన్నారు. అందరి సమక్షంలో తన కవితాగానం వినిపించి సన్మానం పొంది మండలానికే గొప్ప పేరు తెచ్చిపెట్టారని పలువురు కొనియాడారు.

బీటీ రోడ్డుకు మరమ్మతు చేపట్టాలి



సద్దలోనిపల్లి స్టేజీ సమీపంలో గుంతలమయమైన బీటీ రోడ్డు

మల్దకల్: గద్వాల–అయిజ ప్రధాన రహదారిలోని సద్దలోనిపల్లి స్టేజీ సమీపంలో ఉన్న బీటీ రహదారిపై గుంతలు ఏర్పడటంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ రహదారిపై నిత్యం వందలాది వాహనాలతో పాటు గద్వాల ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు రాకపోకలు సాగిస్తోంది. రాత్రి వేళలో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడిన సంఘటనలు చాలా ఉన్నాయి. ఈ విషయమై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాహనదారులు తిమ్మప్ప, మహ్మద్‌లు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బీటీ రోడ్డుకు మరమ్మతులు చేపట్టి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గంగమ్మ ఒడిలో తేలిన గణనాథులు



కేసీ కెనాల్‌లో నీటిలో తేలాడుతున్న విగ్రహాలు

రాజోళి: తొలిపూజలందుకుని విఘ్నాలు తొలగించే గణపయ్యకు కష్టాలు ఎదురయ్యాయి. సరైన వర్షాలు లేక నీటి వనరులు ఎండుముఖం పట్టడంతో గణపయ్య నిమజ్జనం ఉసూరుమంటోంది. గ్రామాల్లో చెరువులు, వాగులు, కాల్వల్లో నీళ్లు లేక గణపయ్యల నిమజ్జనానికి ఇబ్బందులు తప్పడం లేదు. ఈ ఏడాది నెలకొన్న ప్రతికూల వాతావరణాల దృష్ట్యా కృష్ణా, తుంగభద్ర నదుల్లో నీరు అంతంత మాత్రంగానే ఉంది. సుంకేసుల డ్యాంతో పాటు, తుంగభద్ర నది పరివాహక గ్రామాల్లో నదిలోనే నిమజ్జనం చేస్తారు. కానీ నదిలో నీటి ప్రవాహం లేని కారణంగా ఉన్న నీటిలోనే నిమజ్జనం చేశారు. నీరు తక్కువ ఉండటంతో విగ్రహాలు నీటిలో మునగక, ప్రవాహం లేక, అక్కడే నిలిచిపోయాయి. రాజోళి పరిసరాల గ్రామాల వారు డ్యాంకు వెనక వైపు నిమజ్జనం చేసుకుంటున్నారు. మరికొందరు కేసీ కెనాల్‌లో చేస్తున్నారు. డ్యాం ముందు వైపు చే స్తున్నప్పటికీ నీరు లేకపోవడంతో విగ్రహాలు నీటిలోనే తేలియాడుతున్నాయి. కనీస ప్రవాహం లేక ఎక్కడ వేసిన విగ్రహాలు అక్కడే నిలిచిపోయాయి. వడ్డేపల్లి, మానవపాడు మండలాల్లోని ఆయా గ్రా మాల వారు, వారి గ్రామాల్లో నది ఉన్నప్పటికీ డ్యాం వద్దకు రావాల్సిన పరిస్థితి నెలకొంది. డ్యాంకు నిమజ్జనం కోసం వచ్చే గణనాథుల సంఖ్య పెరుగుతోంది. సరిపడినన్ని నీళ్లు లేక విగ్రహాలు ఒకేచోట నిలిచిపోయి, ప్రవాహానికి అడ్డుపడే పరిస్థితి ఏర్పడనుంది.

రోడ్డు సౌకర్యం ఉన్నా.. బస్సు సౌకర్యం లేదు!



నాగర్‌దొడ్డి నుంచి స్టేజీ వరకు కాలినడకన వస్తున్న మహిళలు



రోడ్డు ఉన్నా బస్సు సౌకర్యం లేని బిజ్వారం

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

మల్దకల్: ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చించి గ్రామీణ ప్రాంతాలకు రోడ్డు సౌకర్యం కల్పించినప్పటికీ బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని సద్దలోనిపల్లి నుంచి నేతువానిపల్లి వరకు 8 ఏళ్ల క్రితం కోటి రూపాయల వ్యయంతో బీటీ రోడ్డును ఏర్పాటు చేశారు. కుర్తిరావుల చెర్వు నుంచి అయిజ రోడ్డు వరకు, తాటికుంట నుంచి స్టేజీ వరకు, నాగర్‌దొడ్డి నుంచి అయిజ స్టేజీ వరకు, దాసరపల్లి నుంచి బిజ్వారం వరకు, పెద్దపల్లి నుంచి ఎల్కూరు మీదుగా విఠలాపురం మీదుగా అయిజ వరకు బీటీ రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేశారు. అయినా బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రజలు నిత్యం ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీన్ని అదునుగా చూసుకొని ప్రైవేట్ వాహనదారులు అధిక చార్జీలు వసూలు చేస్తున్నారు. పరిమితికి మించి ప్రయాణికులను చేరవేస్తూ ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు ఉన్న గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు



మల్దకల్ నుంచి కుర్తిరావుల చెర్వు మీదుగా అయిజ వరకు బస్సు సౌకర్యం కల్పించాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. నిత్యం పనుల నిమిత్తం అయిజ– గద్వాలకు వెళ్లేందుకు 4కి.మీల దూరం కాలినడకన వెళ్తున్నాం. పాఠశాలలు, కళాశాలల సమయంలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– బుడ్డన్న, కుర్తిరావల్ చెర్వు

చర్యలు తీసుకుంటాం..



రోడ్డు సౌకర్యం ఉన్న బస్సు సౌకర్యం లేని గ్రామాలను పరిశీలించి, బస్సు సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటాం. వెంటనే ఆయా రూట్లకు బస్సు సర్వీసులు కొ నసాగించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం.

– మంజుల, డిపో మేనేజర్, గద్వాల

బస్సు సౌకర్యం కల్పించాలి



సద్దలోనిపల్లి స్టేజీ నుంచి నేతువానిపల్లి వరకు బస్సు సౌకర్యం కల్పించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. అద్దంలాంటి రోడ్డున్న అద్దాల బస్సులు తిరగకపోవడంతో నిత్యం ఇబ్బందులు పడుతున్నాం. గ్రామం నుంచి సద్దలోనిపల్లి స్టేజీ వరకు కాలినడకన వెళ్లి బస్సులు ఎక్కి వెళ్లాల్సిన పరిస్థితి దాపురించింది.

– లవన్న, సద్దలోనిపల్లి

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99516 02829
మహబూబ్‌నగర్ జిల్లా: 90102 34478, 90105 22215, 97051 35557, 90108 69797, జడ్చర్ల: 97051 35557
నాగర్‌కర్నూల్ జిల్లా: 90100 06785
వనపర్తి జిల్లా: 95539 55603
జోగులాంబ గద్వాల జిల్లా: 95539 55603
నారాయణపేట జిల్లా: 90109 62007
Office mail : advtmbnr@gmail.com